క్లుప్తంగా

మీనాక్షి నటరాజన్‌కు వినతి

అశ్వాపురం: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు వినతిపత్రం అందజేశారు. మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కబ్జా చేసిన విషయంపై పార్టీ పరంగా స్పందించాలని ఆమెను కోరారు.

హోర్డింగ్‌లపై హెచ్చరిక

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండా ఎవరైనా హోర్డింగులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్ బుధవారం

సాక్షి ఎఫెక్ట్..

ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 22న 'సాక్షి'లో వచ్చిన 'ఫ్లెక్సీలతో పరేషాన్' కథనానికి పోలీసులు స్పందించారు. గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి తీసుకుని, వారు కేటాయించిన స్థలాల్లోనే ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎంపీడీఓగా రామారావు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన ఎంపీడీఓగా బుధవారం డి.రామారావు బాధ్యతలు చేపట్టారు. తోటి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్‌కుమార్ మూడు రోజుల కిందట అనారోగ్య కారణాలతో నెల రోజులపాటు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో దమ్మపేట ఎంపీఓగా పనిచేస్తున్న రామారావుకు ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

సింగరేణి ఉద్యోగం అదృష్టం

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో ఉద్యోగం లభించడం గొప్ప అదృష్టమని మణుగూరు ఏరియా జీఎం రామచందర్ తెలిపారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో సింగరేణిలో పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేట్ అయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను బుధవారం జీఎం అందజేశారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, రమేష్, వెంకట్రావు, రాంగోపాల్, కృష్ణంరాజు, శ్రీనివాస్, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ శేషుబాబు

అశ్వారావుపేటరూరల్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అశ్వారావుపేటలోని వీకేడీవీఎస్.రాజు జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలలో చదువుతున్న లక్కదాసు సంధ్య ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వెయ్యికి 993 మార్కులు సాధించింది. అలాగే, శీమకుర్తి అన్విత 992, వర అంజలి 990, దండి లావణ్య 990, బైపీసీలో పమిడి వర్షిణి 993, లొల్ల సుమశ్రీ 989, సీఈసీలో మోర్తా జాహ్నవి 908 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో తోట గీతాంజలి 470 మార్కులకు 466, బైపీసీలో మట్టే శుభశ్రీనిష్మిత 440కు 436, సీఈసీలో బొల్లుకొండ లీలావరప్రసాద్ 500కు 477 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వేలుగోటి శేషుబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

బూర్గంపాడు: ఇరవెండి గ్రామంలో నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపనతోపాటు బుధవారం ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పూజలు చేశారు. తాళ్లూరి చక్రవర్తి, వంశీకృష్ణ, లక్ష్మీ పాల్గొన్నారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్నారు..

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే కుటిల యత్నాలకు పాల్పడుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని పూసుగూడెంలో బుధవారం ఏర్పాటు చేసిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నవరపు కనకయ్య, ఎస్.వినోద, ముదిగొండ రాంబాబు, మూలోతు రావూజా, పులి వెంకటేశ్వర్లు, సామిని పాల్గొన్నారు.

ఐదు రోజులపాటు విద్యుత్ కోత

దమ్మపేట: నాగుపల్లి, నాచారం, గండుగులపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు గురువారం నుంచి ఐదు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం బుధవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి 29 వరకు గంగారం నుంచి నూతన 33 కేవీ లైన్ పనులు ప్రారంభించనున్న కారణంగా ఆ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పేర్కొన్నారు.

సమస్యల వేదికలు..

- రైతు వేదికలకు అందని నిర్వహణ నిధులు
- తాళాలు తీసే వారే లేక.. సౌకర్యాలు కరువై ఇక్కట్లు
- ఏఈఓలు, రైతులకు తప్పని తిప్పలు



తాళం తీయని అనంతారం రైతువేదిక



తలుపులు లేకుండా ఉన్న మరుగుదొడ్డి

అశ్వారావుపేటరూరల్: క్లస్టర్ స్థాయిలో వ్యవసాయాధికారులు, ఏఈఓలు అందుబాటులో ఉండి అన్నదాతలకు మెరుగైన సేవలందించే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదిక భవనాలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ రైతు వేదికల విషయంలో నిర్లక్ష్యం కారణంగా సమస్యలు తిష్ఠ వేశాయి. అశ్వారావుపేట వ్యవసాయ ఏడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో 17 రైతు వేదికలను నిర్మించగా, ఒక్కో భవనానికి ఉపాధి హామీ నిధుల కింద రూ.22 లక్షలు వెచ్చించారు. రైతు వేదికల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. కాగా, అశ్వారావుపేట రైతు వేదిక భవనం సీలింగ్ దెబ్బతిని, వర్షం కురిస్తే కురుస్తోంది. అలాగే, మండలంలోని అనంతారం, తిరుమలకుంటతోపాటు పలుచోట్ల ఫెన్సింగ్ ధ్వంసం కాగా, తిరుమలకుంట కేంద్రానికి గేటు, నారాయణపురం కేంద్రానికి తలుపులు విరిగిపోయాయి. ఇంకా మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోగా, వాటర్ ట్యాప్‌లు ఊడిపోయాయి. ప్రహరీలు నిర్మించకపోవడంతో కేంద్రాలకు రక్షణ లేకపోగా, మూగజీవాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఒకటి, రెండు రైతు వేదికలు మినహా మిగిలిన చోట్ల రైతు వేదికల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయి.

తెరుచుకోని రైతు వేదికలు

అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం, అనంతారం, తిరుమలకుంట, అశ్వారావుపేటలో రైతు వేదికలు ఉన్నాయి. వీటిని క్లస్టర్లుగా విభజించి నాటి ప్రభుత్వం ఐదు వేల ఎకరాలకు ఒక రైతు వేదిక చొప్పున నిర్మించింది. అయితే, అశ్వారావుపేట మండలంలో సుమారు రూ.49 వేల ఎకరాల్లో, అశ్వారావుపేట క్లస్టర్ పరిధిలో 18,200 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ లెక్కల ప్రకారం అశ్వారావుపేట మండలంలో మరో ఆరు, క్లస్టర్ పరిధిలో ఇంకో రెండు నిర్మించాలి. రైతు వేదికలతోపాటు ఏఈఓ పోస్టులు సైతం 10 ఉండాలని, కానీ ప్రస్తుతం అశ్వారావుపేటలో నలుగురు మాత్రమే ఏఈఓలు ఉన్నారు. వీరికి శాఖాపరమైన పనుల భారంతో రైతు వేదికల తాళం తీయడం, నిర్వహణపై దృష్టి సారించే తీరిక దొరకడం లేదు. దీంతో నెలల తరబడి రైతు వేదికల తాళాలు తీసే వారే లేరు. దీంతో కనీస నిర్వహణ కూడా లేకపోగా అస్తవ్యస్తంగా మారాయి.

నిర్వహణ నిధులేవి?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదికల నిర్వహణకు కొద్ది నెలలు నిధులు విడుదల చేసింది. ఒక్కో కేంద్రానికి నెలకు రూ.9 వేలు చొప్పున నిర్వహణ ఖర్చు కింద మంజూరు కాగా, ఐదు నెలలపాటు నిధులు వచ్చాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో ఈ నిధులు అడ్రస్ లేకుండా పోగా, నిర్వహణ భారం ఏఈఓలపై పడుతుండటంతో వారు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు లేకపోవడంతో రైతు వేదికల్లో అంటెండర్లు కూడా లేకపోవడంతో కనీసం తాళం తీయడం, గదులను శుభ్రం చేసే వారే లేకుండా పోయారు. దీంతో రైతు వేదికలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా రాత్రి పూట మందుబాబులకు రైతువేదికలు నిలయాలుగా మారాయి. ప్రభుత్వం దృష్టి సారించి రైతు వేదికల నిర్వహణకు నిధులు కేటాయించడంతో పాటు సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

మండలాల వారిగా రైతు వేదికలు	
మండలం పేరు	రైతువేదికలు
అశ్వారావుపేట	4
దమ్మపేట	4
చంద్రుగొండ	3
అన్నపురెడ్డిపల్లి	2
ములకలపల్లి	4
మొత్తం	17

ప్రతిపాదనలు పంపించాం..



రైతు వేదిక భవనాలకు మరమ్మతులు చేయాల్సిన మాట వాస్తవమే. ఇప్పటికే కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. అశ్వారావుపేట మండలంలో మరో నాలుగు క్లస్టర్ల ఏర్పాటు, భవనాల నిర్మాణాలకు కూడా ప్రతిపాదన చేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది.

–శివరాంప్రసాద్, ఏడీఏ, అశ్వారావుపేట

డీసీహెచ్‌ఎస్ రవిబాబుకు సన్మానం



డాక్టర్ రవిబాబును సన్మానిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జిల్లా ప్రధాన ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) రవిబాబును బుధవారం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ జయంతి రోజున రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న తర్వాత మణుగూరుకు వచ్చిన సందర్భంగా సత్కరించామని వారు తెలిపారు. ఆర్ఎంఓ గౌరిప్రసాద్, వైద్యులు సాయిమోహన్, ప్రసాద్, కృష్ణశ్రీ, ప్రణవ్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయ, ఝాన్సీ, సంజీవరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన



బూర్గంపాడు: ర్యాలీలో సీపీఎం నాయకులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన తమకు మంజూరు చేయలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రామన్నగూడెం గిరిజనులు ఆందోళన చేపట్టారు. గ్రామస్తులంతా ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మాజీ సర్పంచ్ మడకం స్వరూప, మడకం నాగేశ్వరరావు, గ్రామస్తులు నారం కుమారి, కొర్సా ప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కొక్కెరపాటి పుల్లయ్య, సోడెం ప్రసాద్, చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు, మురళీ, కలపాల భద్రం పాల్గొన్నారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రధాన కూడలి నుంచి ప్రదర్శనగా వెళ్లి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, ఎస్కే అబీదా, కొలురి నాగమణి, మీనా, మరియమ్మ, కుంజా రాంబాబు, ఆదూరి నర్సింహారావు, సాధిక, రాధ, చంద్ర, పద్మ పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



అశ్వారావుపేట: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి హత్య చేయడానికి నిరసనగా బుధవారం రాత్రి అశ్వారావుపేటలో ప్రెస్‌క్లబ్ అసోసియేషన్, బీజేపీ ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి శ్రీ పొట్టి శ్రీరాముల సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్, తుమ్మా రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, తాడేపల్లి రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, వలీపాషా, ఎన్డీ నాయకులు గోగినపల్లి ప్రభాకర్, మైనార్టీ నాయకులు ఎస్కే బాబా, రెహ్మత్, వలీ, ముఖరం ఖాన్, యాకూబ్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, అరవింద్, పమ్మిడి లక్ష్మణ్‌రావు, మద్దాల దేవి, శివకుమార్ పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరురూరల్: ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో ప్రదర్శన, శాంతి ర్యాలీ నిర్వహించారు. జంపన సీతారామరాజు, భిక్షపతి, లింగంపల్లి రమేశ్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కిశోర్, రవీందర్, మురళి, మోహన్‌రాజు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం..



మాట్లాడుతున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని కొందరు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, అర్హులకే ఇళ్లు కేటాయించామని ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్హుల జాబితాను ప్రకటించారు. గ్రామంలో మొత్తం 236 మంది అర్హులుండగా తొలివిడతగా 42 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. పార్టీలకు అతీతంగా ఇళ్లు కేటాయిస్తూ తీర్మానం చేశామన్నారు. పోట్రు వేణు, బడుగు రవళి, మడివి పార్వతి, చాపల దుర్గారావు, అకారపు నాగేశ్వరరావు, నల్లమోతు రమణ, చుంద్రు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం

భద్రాచలంటౌన్: పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. మధిరలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసిన విద్యార్థులను భట్టి ఘనంగా సత్కరించడంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉత్తమ ఫలితాలతో పాటు ప్రతిభావంతులను తయారు చేస్తున్న తయ్యారు చేస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేశ్‌బాబు, మాగంటి సిరిలక్ష్మి, గణితం అధ్యాపకుడు ఎండీ బషీర్ పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేశాం



నిర్మాణంలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కరకగూడెం: ప్రజాపాలనలో సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని రేగళ్లలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, కుంజ వసంతరావు, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, యర్ర సురేశ్, గొగ్గల రవి, జలగం కృష్ణ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, స్వర్ణలత

చంద్రుగొండ: అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తామని ఈ దిశగా కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలో బుధవారం పర్యటించిన ఆయన మద్దుకూరు, అన్నారంతండాలో కేరళ తరహాలో నిర్మాణం చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాలను ఆయన ప్రారంభించారు. చంద్రుగొండ, రేపల్లెవాడ గ్రామాలకు మంజూరైన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. చంద్రుగొండలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో శిశుసంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనిన, ఎంపీడీఓ అశోక్, సీడీపీఓ సలోమి, ఎంఈఓ సత్యనారాయణ, నాయకులు భోజ్యానాయక్, రమణ, ఏడుకొండలు, విజయ్, సురేశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతి అందిస్తున్న సైదులు

అశ్వారావుపేటరూరల్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి సైదులు, జవహర్ విద్యాలయం కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రమేశ్, ఫైర్ సిబ్బంది నరేశ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం చేయాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని, తద్వారా ఎంతో జ్ఞానం పొందే అవకాశం దక్కుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్పందన అన్నారు. బుధవారం మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (దమ్మపేట)లో ప్రపంచ పుస్తక దినోత్సవంతోపాటు కాపీరైట్ దినోత్సవం, ఆంగ్ల భాషా దినోత్సవం, ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

సంబరాలకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు తోటమల్ల సురేశ్‌బాబుకు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందిన్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మే 10, 11 తేదీల్లో ఏపీలోని ఏలూరు పట్టణంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించనున్నారని తెలిపారు.

సేంద్రియ సాగు చేపట్టాలి

ములకలపల్లి: సేంద్రియ పద్ధతులు పాటించి పంటల్లో అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) మనోహర్, రమేశ్ సూచించారు. గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కొమ్ముగూడెం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై మహిళా రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకాన్ని క్రమేపీ తగ్గించాలని పిలుపునిచ్చారు. సిస్టర్ నిర్మల, సాగర్, సుజాత పాల్గొన్నారు.

పాఠశాలకు పలువురి వితరణ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం వితరణ అందించారు. గ్రామానికి చెందిన వీరమాచినేని పూర్ణచందర్‌రావు గ్యాస్‌స్టౌ, సిలిండర్ కొనుగోలు కోసం రూ.5 వేలు, బోయినపల్లి కవిత మరో సిలిండర్‌ను వితరణగా అందించారు. కొత్తగూడెంలోని ప్రముఖ వ్యాపారవేత్త సంపత్ పేదపిల్లలకు దుస్తులు వితరణగా అందించారు. ఐటీసీ సంస్థ అందించిన నోట్‌బుక్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, హెచ్ఎం వసుంధర, ఉపాధ్యాయులు సంధ్య, శ్రీలత పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలల సమాజం నిర్మించడమే లక్ష్యం



మాట్లాడుతున్న వినోద్‌రావు

భద్రాచలంటౌన్: సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేడ్కర్ కన్న కలలను సాధ్యం చేయడమే బీజేపీ లక్ష్యమని రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు, గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కులాల్‌నాయక్ అన్నారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కుంజా ధర్మ, పసుమర్తి సతీశ్, జంపన సీతారామరాజు, ఏనుగుల వెంకటరెడ్డి, బాలరాజు, మెట్ట వెంకటేశ్, శ్రీనివాస్, నాగబాబు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రాంగణాలు లేక.. ప్రయాస

- ఎండయినా, వానయినా రోడ్లపైనే ఎదురుచూపులు
- బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల వేడుకోలు



ఆర్.కొత్తగూడెంలో రామాలయం సమీపంలో నిల్చున్న ప్రయాణికులు



సత్యనారాయణపురంలో చెట్టు నీడన కూర్చున్న ప్రయాణికులు

చర్ల: బస్ షెల్టర్లు లేక ప్రయాణికులకు నిలువనీడ కరువవుతోంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు పడాల్సి వస్తోంది. అటు ఆర్టీసీ కానీ, ఇటు గ్రామ పంచాయతీలు కానీ ప్రయాణ ప్రాంగణాలు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలు విపరీతంగా ఉంటుండగా గ్రామాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండల్లోనే లేదంటే ఏదైనా చెట్టు ఉంటే దాని కింద వేచి చూస్తున్నారు.

చీదరింపులూ తప్పడం లేదు..

మండలంలో ప్రధాన రహదారిపై ఉన్న మామిడిగూడెం, దేవరాపల్లి, బోటిగూడెం, ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు, తేగడ, గెంపెన్నగూడెం, రాళ్లగూడెం, రైస్‌పేట, సీ కత్తిగూడెం గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. ఈ గ్రామాలతో పరిసర ప్రాంతాల వారు నిత్యం చర్ల, భద్రాచలం, వెంకటాపురం తదితర గ్రామాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే బస్సుల కోసం ఎదురుచూసే సమయంలో కూర్చునేందుకు కనీసం నిల్చునేందుకు కూడా షెల్టర్లు లేవు. దీంతో ఎండల్లోనే లేదంటే బస్సులు నిలిపే చోట ఉండే చెట్లు, దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. కాగా, ఒక్కోసారి దుకాణాదారుల నుంచి చీదరింపులు కూడా ఎదర్కోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

కొన్నిచోట్ల ఉన్నా.. నిరుపయోగమే

మండలంలోని రాళ్లగూడెం, కుదునూరు, పెదమిడిసిలేరు క్రాస్‌రోడ్, కేశవాపురం, కొయ్యూరు, సుబ్బంపేట గ్రామాల్లో గతంలో స్వచ్ఛంద సంస్థలు, మిర్చీ కమీషన్ ఏజెంట్లు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో బస్ షెల్టర్లు నిర్మించినా అవి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని శుభ్రం చేయకపోవడం, సిమెంట్ దిమ్మెలు విరిగిన చోట మరమ్మతులకు నోచుకోకపోవడంతో అక్కడ కనీసం నిల్చునేందుకు కూడా అనువుగా లేవు. ఆయా గ్రామ పంచాయతీలు కొంత నిధులు కేటాయించి వాటిని ఉపయోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండల కేంద్రంలోనూ అదే పరిస్థితి

మండల కేంద్రమైన చర్లలో పెట్రోల్‌బంక్ సెంటర్, గాంధీ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం సెంటర్లలోనూ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. చర్ల నుంచి లింగాపురం, గొంపల్లి, మొగళ్లపల్లి, కొత్తపల్లి, చింతకుంట, జీపీపల్లి, వీరాపురం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించే వారు ఆటోల కోసం తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల వద్దే వేచి ఉండాలి. ఇక బస్టాండ్‌కు రాలేని వారు పెట్రోల్‌బంక్, గాంధీ సెంటర్లలో బస్సులు ఎక్కుతుంటారు. ఒక్కోసారి బస్సు ఆపకపోతే ఇబ్బందులు ఎదురవుతుంటాయి. తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చెట్లే శరణ్యం



బస్ షెల్టర్ లేక చెట్ల కిందే ఉండాల్సి వస్తోంది. అక్కడ కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం లేదు. చాలాసమయం వరకూ బస్సు రాకపోవడంతో ఎండ తాకిడికి ఇబ్బంది అవుతోంది. కాళ్లు పీకడం, కళ్లు తిరగడం వంటివి జరుగుతున్నాయి.

–సీహెచ్.సుధాకర్, తేగడ

దుకాణాదారుల నుంచి చీదరింపులు



బస్ షెల్టర్ లేక సెంటర్లలో ఉండే దుకాణాల వద్దకు వెళ్తే వారి నుంచి చీదరింపులు ఎదురవుతున్నాయి. మా కొనుగోలుదారులకు ఇబ్బంది అవుతోందని, పక్కకు వెళ్లాలని అంటున్నారు. గ్రామాల్లో వెంటనే బస్ షెల్టర్లు నిర్మించాలి.

–ఎం.విజయ్, ఆర్.కొత్తగూడెం